# పెద్దమనిషి




కోనే నాగ వెంకట ఆంజనేయులు

**టౌ**న్‌లో చిన్న చిన్న పనులన్నీ చక్కబెట్టుక్కు తరువాత గాజువాక వెళ్ళడానికి కొత్తరోడ్ బస్‌స్టాప్‌లో నిలబడ్డాను. పదినిముషాల తరువాత నలభై నాలుగో నెంబర్ బస్ వచ్చి ఆగింది స్టేజ్‌లో.

ఫార్టీఫోర్ బస్సెప్పుడూ రష్‌గానే ఉంటుంది. అంత రష్‌లోనూ ఎలాగో తోసుకుని బస్సెక్కి అందరినీ దాటుకుని బస్‌లోపలికి వెళ్ళాను.

'హమ్మయ్య' అని ఊపిరి పీల్చుకున్నాను. ఈ బస్ దాటితే మరో గంట వరకూ బస్ లేదు మరి గాజువాకవైపు.

బస్‌లో సీట్లన్నీ నిండిపోయాయి. లేడీస్ వైపు కూడా అన్ని సీట్లూ నిండిపోయాయి. నలుగురైదుగురు అమ్మాయిలు పైనున్న రాడ్ పట్టుకుని నిలబడి ఉన్నారు.

బస్ బయలుదేరింది.

ఓ అమ్మాయి ప్రక్కన ఓ నడివయసు వ్యక్తి ఆమెను తాకుతున్న ట్లుగా నిలబడి ప్రక్కనున్న మరోవ్యక్తితో కబుర్లాడుతున్నాడు.

ఆ అమ్మాయి చాలా అందంగా ఉంది.

ఆవ్యక్తి కావాలని తాకుతున్నట్లుగా కాక బస్ కుదుపులకు ఆమెమీద పడుతున్నట్లు అనిపించేలా ఆమెపై వాలుతుండడం గమనించాను నేను.

పాపం ఆ అమ్మాయి అతని తాకిడికి అందకుండా ఉండాలని శతవిధాల ప్రయత్నిస్తోంది. కానీ అతన్నుంచి తప్పించుకోలేక పోతోంది.

అవకాశం దొరికినప్పుడల్లా ఆ'పెద్దమనిషి' ఆ అమ్మాయి మీద పడుతూనే ఉన్నాడు. పాపం ఆ అమ్మాయి నిశ్శబ్దంగా అతని ఆగడం భరిస్తోంది.

రోడ్‌మీద వెళుతున్న స్కూటరొకటి బస్‌కి అడ్డంగా రావడంతో డ్రైవర్ సడెన్‌బ్రేక్ వేశాడు.

ఆ వ్యక్తి తూలివడి ఆమెపై పూర్తిగా ఒరిగిపోయాడు. అతను నిలదొక్కుకోవడానికి చాలాసమయం పట్టింది.

అప్పుడు జరిగింది జరగాల్సింది.

ఆ అమ్మాయి ఈడ్చి పెట్టి అతని చెంప పగలగొట్టింది. ఎంత కసిగా కొట్టిందంటే- బస్‌లో అందరూ ఆశబ్దానికి తలలు తిప్పి చూశారు.

కాని ఆవ్యక్తి గాబరాపడలేదు. సిగ్గుపడలేదు. శాంతస్వరంతో అన్నాడు.

"నువ్వు చేసిన పనిలో తప్పేమి లేదమ్మా ! కానీ నేను కావాలని అలా చెయ్యలేదు. బస్ సడన్‌గా ఆగడంతో ఆపుకోలేక నీమీద తూలి పడ్డాను. అంతే. అయినా నాతప్పు తప్పే! నన్ను క్షమించు." అన్నాడావ్యక్తి.

ఆ అమ్మాయి బిత్తరపోయింది.

నేనూ నా పొరపాటు గ్రహించాను.

అంత రష్‌లో అంత దగ్గరగా ఉన్న ఆడా,మగా - ఒకరొకొకరు తగలకుండా ప్రయాణం చెయ్యడం చాలా కష్టం.

ఆ వ్యక్తి విషయంలో ఆ అమ్మాయితో పాటు నేనూ పొరబడ్డాను.

"సారీ అండీ ! కావాలని బస్‌లో అమ్మాయిల మీద పడే రౌడీ

రాస్కెల్స్ లాంటి వారే మీరు కూడా అనుకున్నాను. అయామ్ వెరీ సారీ" అందా అమ్మాయి నొచ్చుకుంటూ.

" పరవాలేదమ్మా ! యిట్సాల్ రైట్," అన్నాడా వ్యక్తి మర్యాదగా.

సింధియా జంక్షన్ దగ్గర లేడీస్ సీట్లు కొన్నిఖాళీ అయ్యాయి.

ఖాళీ అయిన ఒక సీట్లో ఆ అమ్మాయి కిటికీవైపు కూర్చుంది. మిగతా ఆడవాళ్ళు ఖాళీ అయిన సీట్లలో సర్దుకున్నారు. ఆ అమ్మాయి ప్రక్కన కూర్చోడానికి మరో ఆడమనిషి లేదు.

బస్‌లో రష్ ఏమాత్రం తగ్గలేదు.

ఆ అమ్మాయి ఆ వ్యక్తి వైపు తిరిగి "రండి. కూర్చోండిలా" అంటూ ఆ వ్యక్తికి తన ప్రక్కన సీటు చూపించింది.

వెంటనే ఆ వ్యక్తి ఆమె ప్రక్కన కూర్చుని "థ్యాంక్స్" చెప్పేడు.

అనవసరంగా ఆ పెద్దమనిషి చెంప పగలగొట్టినందుకు పశ్చాత్తాపంతో ఆమె ఆ వ్యక్తికి సీట్ ఆఫర్ చెయ్యడం సమంజసంగానే అనిపించింది నాకు.

నాకు సీటు దొరకలేదు.

బస్ మల్కాపురం దాటుతోంది.

ఆమె ప్రక్కన కూర్చున్న ఆ వ్యక్తి - నిలబడి ఉన్న తన ఫ్రెండ్‌తో మాట్లాడుతూనే వున్నాడు చేతులు త్రిప్పుతూ.

మర్యాదస్తుడైన ఆ వ్యక్తిని అనవసరంగా అనుమానించినందుకు నేనింకా బాధపడుతూనే ఉన్నాను.

గాజువాక సినిమాహాల్స్ దగ్గర నేను బస్ దిగిపోయాను.

ఆ అమ్మాయి ప్రక్కన కూర్చున్న వ్యక్తి కూడా తన ఫ్రెండ్‌తో కలిసి అక్కడే దిగిపోయాడు.

బస్ స్టీల్‌ప్లాంట్ వైపు సాగిపోయింది.

ఆ వ్యక్తులిద్దరికీ కాస్త దూరంలో నడుస్తున్నాను నేను.

వాళ్ళ మాటలు నాకు వినబడుతూనే ఉన్నాయి.

"చెంప దెబ్బ తింటే తిన్నాను గానీ - బస్ డ్రైవర్ సడెన్‌బ్రేక్ వేసినప్పుడు నా చేతులకు ఆ అమ్మాయి అందాలు భలే మెత్తగా తగిలాయిరా. వదల్లేకపోయాననుకో పైగా అంత అందమైన అమ్మాయి ప్రక్కన సీటు కూడా దొరకడంతో మోచేత్తో కూడా అమితమైన స్పర్శాసుఖం అనుభవించానులే." తన్మయత్వంతో చెప్పుకుపోతున్నాడు ఆ నడివయసు 'పెద్దమనిషి'.

నేను నిశ్చేష్టుడినయ్యాను.


## పాఠకులకు, ఏజెంటులకు విజ్ఞప్తి

**'చినుకు'** మాసపత్రిక కొరకు పంపవలసిన చందాలను, డిపాజిట్లను మీ దగ్గరలో ఉన్న ఆంధ్రాబ్యాంక్ శాఖలలో **చినుకు సాహిత్య మాసపత్రిక, గాంధీనగర్.** C.A. **No. 3694 లో** చెల్లించవచ్చు. దీనికి ఎటువంటి ఛార్జీ వసూలుచేయబడదు.


## చాటు నిజం

పందికొక్కులు తవ్విపోసిన ఈ మట్టిలో
జీవం ఎంతటిదో బీజాన్నడుగు
పీఠం ఎక్కిన అందానికే పట్టం కడతామంటే
ఆ పట్టం పరిధి ఎంత?
రథ చక్రాలకే అలంకరణలంటే
ఆ అలంకరణల విలువెంత?
దున్నినా రాతినేలకు మొలిచే గుణం ఏదీ?
తిరస్కారం మానమున్న మస్తిష్కానికే పరిష్కారం.
ఛత్రాజుల పాఠాలకు కాలం ఒక గీటురాయి
బండరాయికి కైమోడ్పే తత్వానికి
మనిషి మనసే శిలాఫలకం
ప్రతి కన్నూ ఎదుటి కంటినే అద్దంలో చూస్తుంది
జీవితం రాజకీయ శాస్త్రం కాదు.
ఒక శిథిలమైన యుగంపైన
ముసుగు కప్పిన ప్రతిబింబాలు
గాలి కొన్ని గుమ్మాల సందుల్లో బందీ అయితే
శ్వాసనాళాలు బిగదీసుకుంటాయి.
రక్తం కలిపిన అక్షరాలను
తారుమారు చేసే నయవంచకత్వం
భుజాలను విరగ్గొడుతోంది
వాళ్ళూ మాట్లాడతామంటున్నారు... మాట్లాడనియ్యండి
నిజాలు సలుపుతాయి
వాళ్ళనీ నిటారుగా నిలవనియ్యండి
ఇజాలు విరుగుతాయి
వాళ్ళనీ స్వేచ్ఛగా పాడనీయండి
అహాలు నలుగుతాయి.

- ఎన్.సి.హెచ్. చక్రవర్తి


చినుకు సాహిత్య మాసపత్రిక

చదవండి! చదివించండి!

చందాదారులు కండి!

సంవత్సర చందా రూ. 100/-